




# కివీస్ హ్యాట్రిక్




### బంగ్లాదేశ్‌పై జయకేతనం

చెన్నై: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొడుతున్న న్యూజిలాండ్.. వన్డే ప్రపంచకప్‌లో హ్యాట్రిక్ కొట్టింది. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఇంగ్లండ్, నెదర్లాండ్స్‌ను చిత్తుచేసిన కివీస్ శుక్రవారం మూడో మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను మట్టికరిపించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన బంగ్లా 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 245 పరుగులు చేసింది. ముష్ఫికర్ రహీమ్ (66) అర్ధశతకం బాదగా.. కెప్టెన్ షకీబ్ (40), మహ్మదుల్లా (41 నాటౌట్) ఆకట్టుకున్నారు. కివీస్ బౌలర్లలో ఫెర్గూసన్ 3, బౌల్ట్, హెన్రీ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో న్యూజిలాండ్ 42.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 248 పరుగులు చేసింది. డారిల్ మిషెల్ (67 బంతుల్లో 89 నాటౌట్; 6 ఫోర్లు, 4 సిక్సర్లు), కెప్టెన్ కేన్ విలియమ్సన్ (78; 8 ఫోర్లు, ఒక సిక్సర్) దుమ్మురేపారు. ఫెర్గూసన్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

# ఒలింపిక్స్‌లో క్రికెట్

### ఐవోసీ ఆమోదముద్ర
### 2028 విశ్వక్రీడల్లో ప్రవేశం

ముంబై: ప్రతిష్ఠాత్మక ఒలింపిక్స్‌లో క్రికెట్ పున:ప్రవేశానికి రంగం సిద్ధమైంది. ఎప్పుడెప్పుడు విశ్వక్రీడల్లో క్రికెట్ చూస్తామనుకున్న అభిమానుల ఆశలు నెరవేరబోతున్నాయి. లాస్‌ఏంజిల్స్ వేదికగా 2028లో జరిగే విశ్వక్రీడల్లో క్రికెట్‌ను భాగం చేసేందుకు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ(ఐవోసీ) గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. శుక్రవారం సమావేశమైన ఐవోసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు క్రికెట్‌తో పాటు సాఫ్ట్‌బాల్, ఫ్లాగ్ ఫుట్‌బాల్, లాక్రోస్సె(సిక్సెస్), స్క్వాష్ ఒలింపిక్స్‌లో భాగం చేయబోతున్నది. ఆదివారం నుంచి మొదలయ్యే ఐవోసీ సెషన్స్‌లో ఈ ప్రతిపాదనను సభ్యుల ముందు ఉంచి ఓటింగ్ చేపట్టనున్నారు. ఈ నిర్ణయంతో లాస్‌ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో టీ20 ఫార్మాట్‌లో పురుషుల, మహిళల జట్లు బరిలోకి దిగనున్నాయి. ఇన్నాళ్లు ప్రపంచకప్, చాంపియన్స్ ట్రోఫీ, ఆసియాకప్ లాంటి వాటికి పరిమితమైన టీమ్‌ఇండియా ఇప్పుడు ఒలింపిక్స్‌లోనూ పోటీకి దిగనుంది.

# హెచ్‌సీఏ అధ్యక్ష బరిలో జగన్




హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ)లో ఎన్నికల కోలాహలం నెలకొన్నది. సంస్కరణల తర్వాత మాజీ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ వీఎస్ సంపత్ పర్యవేక్షణలో పకడ్బందీగా ఎన్నికల ప్రక్రియ సాగుతున్నది. ఈ నెల 20వ తేదీన ఎన్నికలు జరుగనుండగా, శుక్రవారంతో నామినేషన్ల పర్వానికి తెరపడింది. యూనైటెడ్ మెంబర్స్ ఆఫ్ హెచ్‌సీఏ తరపున అర్సనపల్లి జగన్‌మోహన్‌రావు అధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలు చేశారు. ఇప్పటికే తన చాతుర్యంతో జాతీయ హ్యాండ్‌బాల్ అసోసియేషన్(హెచ్‌ఐఏ)లో వివాదాలకు ముగింపు పలికిన జగన్ తాజాగా హెచ్‌సీఏ ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. గత కొన్నేండ్లుగా హెచ్‌సీఏలో నెలకొన్న అవినీతి, అక్రమాలను రూపుమాపేందుకు కచ్చితమైన విజన్‌తో ముందుకు వచ్చారు. ప్యానెల్‌లో జగన్‌తో పాటు శ్రీధర్(ఉపాధ్యక్షుడు), హరినారాయణ(కార్యదర్శి), నోయల్ డేవిడ్(సంయుక్త కార్యదర్శి), శ్రీనివాస్(కోశాధికారి), అహ్మద్ ఖాన్(కౌన్సిలర్) పోటీపడుతున్నారు. శనివారం నామినేషన్ల స్క్రూటినీ జరుగనుండగా, నామినేషన్ల ఉపసంహరణ ఈ నెల 16తో ముగియనుంది.

### పాకిస్థాన్ భారత్ అమీతుమీ

# బిగ్ ఫైట్

### నేడు దాయాదుల సమరం

**నరాలు తెగే ఉత్కంఠ సన్నివేశాలకు.. రోమాలు నిక్క బొడుచుకునే ఉద్వేగ భరిత దృశ్యాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే దాయాదుల సమరానికి సమయం ఆసన్నమైంది. యావత్ క్రీడా జగత్తును మునివేళ్లపై నిలబెట్టగల మెగా మ్యాచ్‌లో గెలిచినోడు రాకింగ్.. ఓడినోడు బ్యాకింగ్! ఆడినోడు హీరో.. ఆడనోడు జీరో!**

**గల్లి పోరగాండ్ల నుంచి.. ఢిల్లీ పొరుల దాకా! రోజు కూలీల నుంచి.. రాష్ట్రపతి దాక!! ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న మహా సంగ్రామానికి సర్వం సిద్ధమైంది. ప్రపంచకప్‌లో ఎదురుపడ్డ ఏడుసార్లు పాకిస్థాన్‌ను చిత్తుచేసిన ఘన చరిత్ర టీమ్‌ఇండియాదైతే.. దాన్ని తిరగరాయడమే పనిగా పెట్టుకొని బాబర్ సేన పావులు కదుపుతున్నది. మరింకెందుకు ఆలస్యం లక్షా 32 వేల మంది రణన్నినాదాల మధ్య.. 22 గజాల పిచ్‌పై 22 మంది తలపడే మహా యుద్ధానికి మీరూ సిద్ధమైపోండి!**




ఐపీఎల్లో ఐదు ట్రోఫీలు అందుకున్న రోహిత్‌శర్మ..
నువ్వు వన్డే వరల్డ్‌కప్ ముద్దాడితే చూడాలన్నది మా కల!

క్రికెట్ యవనికపై లెక్కకు మిక్కిలి
రికార్డులు ఖాతాలో వేసుకున్న కోహ్లీ..
సహచరులు నిన్ను భుజానెత్తుకోవడం
వీక్షించాలన్నది మా ఆశ!

అటు బంతితో ఇటు బ్యాట్‌తో దుమ్మురేపగల పాండ్యా..
నువ్వు కపిల్‌దేవ్, యువరాజ్‌ను
మైమరిపించాలనేది మా అభిమతం!

మిడిలార్డర్‌కు పిల్లర్ లాంటి అయ్యర్..
నువ్వు జట్టు భారం మోయాలనేది మా కోరిక!

లోకేశా నువ్వు వికెట్ల వెనుక ధోనీని
తలపించాలనేది మా తృష్ణ!

దేశం తీర్చిదిద్దిన అత్యుత్తమ పేసర్లలో
అగ్రగణ్యుడివైన బుమ్రా..
నీ దమ్మేంటో ప్రపంచానికి చాటే సమయం ఆసన్నమైంది!

లోకల్ ట్రైన్‌లో ప్రయాణించేటంతటి
సింపుల్ మ్యాన్ శార్దూల్..
నువ్వు అటు బంతితో ఇటు బ్యాట్‌తో మాయ చేయి!

గల్లీ క్రికెట్ నుంచి వచ్చిన సిరాజ్..
నువ్వు మరెందరో బస్తీ పొరగాళ్లకు
మార్గదర్శిగా నిలవాలన్నది మా ఆశ!

క్రికెట్ ఇంజనీర్ అశ్విన్ నీ అపార అనుభవాన్ని
మైదానంలో వినియోగించు..

రాక్‌స్టార్ జడ్డూ.. నువ్వు ప్రత్యర్థులను రఫ్ఫాడిస్తూ..
బ్యాట్ సాముతో రెచ్చిపో!!

పన్నెండేండ్ల తర్వాత స్వదేశంలో జరుగుతున్న వన్డే ప్రపంచకప్‌లో భారత జట్టు విశ్వ విజేతగా అవతరించాలని కలలు కంటున్న ప్రతి ఒక్క అభిమాని మనసులో మాట ఇది. ఆస్ట్రేలియాను చిత్తు చేసి మెగాటోర్నీలో ఆది విఘ్నాన్ని అలవోకగా దాటేసిన టీమ్‌ఇండియా.. ఇక చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్ పని పెట్టేందుకు సిద్ధమైంది! వరల్డ్‌కప్ ఫైనల్ కంటే ఎక్కువ ఒత్తిడితో కూడుకున్న ఈ పోరులో పైచేయి సాధిస్తే.. ఇక సెమీస్ దారిలో టీమ్‌ఇండియాను అడ్డుకునేంత దమ్మున్న జట్టు మరొకటి లేదనేది వాస్తవం! మరి 140 కోట్ల మంది ప్రార్థనలు వెంట పెట్టుకొని అహ్మదాబాద్‌లో అడుగుపెట్టిన రోహిత్ సేన.. అష్ట దిగ్బంధనంతో పాక్‌ను ఎనిమిదోసారి పాతరేయాలని ఆకాంక్షిద్దాం!

–ఓ అభిమాని మనోగతం!

అహ్మదాబాద్: ప్రపంచకప్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మక మ్యాచ్‌కు వేళైంది. ప్రపంచంలోనే అతి పెద్దదైన క్రికెట్ స్టేడియంలో శనివారం పాకిస్థాన్‌తో భారత్ తలపడనుంది. ఇప్పటి వరకు వరల్డ్‌కప్‌లో ఇరు జట్ల మధ్య ఏడు మ్యాచ్‌లు జరగగా.. ఆ ఏడింట్లోనూ టీమ్‌ఇండియానే విజయం వరించింది. ఈ సారి కూడా అదే ఫలితం రాబట్టాలని రోహిత్ సేన తహతహలాడుతుంటే.. గతాన్ని మర్చిపోయి నయా చరిత్ర లిఖిస్తామని పాక్ సారథి బాబర్ ఆజమ్ అంటున్నాడు. మరి ఒత్తిడిలో ప్రపంచ యుద్ధాన్ని తలపించే ఈ సంగ్రామంలో విజేతలు ఎవరో తేలాలంటే మరి కొన్ని గంటలు వేచి చూడాల్సిందే. గతంలో భారత్, పాకిస్థాన్ మ్యాచ్ అంటే చాలు.. పాక్ బౌలింగ్‌కు, టీమ్‌ఇండియా బ్యాటింగ్‌కు మధ్య పోరుగా అభివర్ణించేవాళ్లు. కానీ కాలం మారింది. భారత్ జట్టులో కూడా మెరుగైన పేసర్లు అందుబాటులోకి రాగా.. బ్యాటింగ్‌లో పాకిస్థాన్ ఎంతో మెరుగైంది. ప్రస్తుతం వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో ఉన్న బాబర్ ఆజమ్‌తో పాటు ఇమామ్, అబ్దుల్లా, రిజ్వాన్, షకీల్, ఇఫ్తిఖార్, షాదాబ్‌తో పాక్ బ్యాటింగ్ బలంగా కనిపిస్తున్నది. మెగాటోర్నీలో రెండు జట్లు ఆడిన రెండు మ్యాచ్‌లు నెగ్గి మంచి జోష్ మీద ఉండగా.. భారత యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ డెంగ్యూ నుంచి పూర్తి స్థాయిలో కోలుకున్నట్లే అని రోహిత్ వెల్లడించాడు. మరి కీలకమైన పోరులో అతడికి అవకాశం ఇస్తారా లేక ఇషాన్‌నే కొనసాగిస్తారా చూడాలి. పాకిస్థాన్‌పై ఘనమైన రికార్డు ఉన్న విరాట్ కోహ్లీతో పాటు రోహిత్, శ్రేయస్, రాహుల్, పాండ్యా సమిష్టిగా సత్తాచాటాలని టీమ్ మేనేజ్‌మెంట్ కోరుకుంటున్నది. పాక్ ప్రధాన పేసర్ షాహీన్ షా అఫ్రిది నుంచి టాపార్డర్‌కు ప్రధాన ముప్పు పొంచి ఉంది. కాస్త నిలదొక్కుకుంటే అతడి బౌలింగ్‌లో పరుగులు రాబట్టడం పెద్ద కష్టం కాకపోయినా.. ముఖ్యంగా తొలి స్పెల్‌ను ఎదుర్కోవడంపైనే అందరి దృష్టి నిలువనుంది.




**7-0** వన్డే ప్రపంచకప్‌లో ఇప్పటి వరకు భారత్, పాక్ మధ్య ఏడు మ్యాచ్‌లు జరగగా.. ఏడింటా టీమ్‌ఇండియానే గెలిచింది.

### ఆ ఏడు విజయాలు..

| ఏడాది | వేదిక | ఫలితం | మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ |
|---|---|---|---|
| 1992 | సిడ్నీ | 43 పరుగులతో | సచిన్ |
| 1996 | బెంగళూరు | 39 పరుగులతో | సిద్ధు |
| 1999 | మాంచెస్టర్ | 47 పరుగులతో | వెంకటేశ్ |
| 2003 | సెంచూరియన్ | 6 వికెట్లతో | సచిన్ |
| 2011 | మొహాలీ | 29 పరుగులతో | సచిన్ |
| 2015 | అడిలైడ్ | 76 పరుగులతో | కోహ్లీ |
| 2019 | మాంచెస్టర్ | 89 పరుగులతో | రోహిత్ |

### తుది జట్లు (అంచనా)

**భారత్:** రోహిత్ (కెప్టెన్), గిల్/ఇషాన్, కోహ్లీ, శ్రేయస్, రాహుల్, పాండ్యా, జడేజా, అశ్విన్/షమీ, బుమ్రా, కుల్దీప్, సిరాజ్.

**పాకిస్థాన్:** బాబర్ (కెప్టెన్), అబ్దుల్లా, ఇమామ్, రిజ్వాన్, షకీల్, ఇఫ్తిఖార్, షాదాబ్, నవాజ్, షాహీన్, హసన్ , రవుఫ్.

### పిచ్, వాతావరణం

అహ్మదాబాద్ పిచ్ బ్యాటింగ్‌కు సహకరించే చాన్స్ ఉంది. ఇక్కడ జరిగిన తొలి పోరులో ఇంగ్లండ్‌పై న్యూజిలాండ్ దంచికొట్టింది. వాతావరణం వేడీగా ఉండనుంది. టాస్ గెలిచిన జట్టు ఛేదనకు మొగ్గుచూపొచ్చు. మ్యాచ్‌కు వర్ష సూచనలేదు.



విమలక్కకు అవార్డు అందజేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జీ రాధారాణి, ప్రముఖ సినీ నటుడు, దర్శకుడు ఆర్ నారాయణమూర్తి. చిత్రంలో సుద్దాల అశోక్ తేజ

# విమలక్కకు 'సుద్దాల' పురస్కారం ప్రదానం

చిక్కడపల్లి, అక్టోబర్ 13: అరుణోదయ కళాకారిణి విమలక్కకు సుద్దాల హనుమంతు– జానకమ్మ జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేశారు. సుద్దాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆమెను అవార్డు, ప్రశంసాపత్రంతో ఘనంగా సత్కరించారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సుద్దాల అశోక్ తేజ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జీ రాధారాణి, ప్రముఖ సినీ నటుడు, దర్శకుడు ఆర్ నారాయణమూర్తి, రాష్ట్ర ప్రభుత్వ వాస్తు సలహాదారు సుద్దాల సుధాకర్‌తేజ, ఉస్మానియా తెలుగు శాఖ అధ్యక్షుడు చింతకింది కాశీం, ప్రముఖ రచయిత్రి అయినంపూడి శ్రీలక్ష్మి తదితరులు హాజరయ్యారు. సిటీ కాలేజీ తెలుగు శాఖ అధ్యక్షుడు కోయి కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మోదుగు పూలు సంపాదకులు భూపతి వెంకటేశ్వర్లు, రచ్చ భారతి, సుద్దాల ప్రభాకర్, బల్ల కౌముది, లాలిత్య, స్వప్న సుద్దాల, అందె భాస్కర్ పాల్గొన్నారు.



హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న పబ్బతి శ్రీకృష్ణ

# బీజేపీని ఓడించడమే లక్ష్యం

- మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు శ్రీకృష్ణ

హిమాయత్‌నగర్, అక్టోబర్ 13: దేశం, రాష్ట్రంలో జరిగే ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా పని చేస్తామని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ స్పష్టం చేశారు. శుక్రవారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలు, ఆస్తులను కార్పొరేట్‌కు తాకట్టు పెట్టడంతో నిరుద్యోగం, పేదరికం, ఆర్థిక అసమానతలు విపరీతంగా పెరిగాయని ఆరోపించారు. ఆదివాసీ గిరిజన, దళిత, బలహీన వర్గాల మహిళలపై దాడులు, హత్యలు చేసిన ఘనత బీజేపీ నాయకులదేనని అన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరినందుకు ట్రాక్టర్లు, కార్లతో తొక్కించి చంపిన బీజేపీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు. మతం పేరిట చిచ్చు పెట్టేందుకు కుట్రలు పన్నుతున్న బీజేపీ ప్రజలు బుద్ధి చేపాల్సిన సమయం ఆసన్నమైనందని పిలుపునిచ్చారు. తెలంగాణలో బీజేపీకి డిపాజిట్లు దక్కకుండా చేయాలని సూచించారు. సమావేశంలో మాల మహానాడు వ్యవస్థాపకుడు బీ రఘునాథ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీలో కొత్త లొల్లి

- తమను పట్టించుకోవట్లేదంటున్న పలువురు సీనియర్ నాయకులు
- ప్రత్యేకంగా సమావేశమైన 50 మంది కమలం నేతలు
- తమకు అసెంబ్లీ టికెట్లు కేటాయించాలని డిమాండ్

హైదరాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): బీజేపీలో రోజుకో వర్గం తెరమీదికి వస్తున్నది. ఇప్పటికే కిషన్‌రెడ్డి వర్గం, బండి సంజయ్ వర్గం, ఈటల రాజేందర్ వర్గం అంటూ రాష్ట్ర నాయకత్వం చీలికలు పేలికలయ్యింది. ఒకరిపై ఒకరు ఢిల్లీలో ఫిర్యాదులు చేసుకుని, పదవులకు ఎసరు తెచ్చుకునే స్థాయికి విభేదాలు చేరిన సంగతి తెలిసిందే. పేరున్న నాయకులు పట్టుమని పదీఇరవై మంది లేకున్నా నేతలు నాలుగైదు వర్గాలుగా విడిపోవడంపై శ్రేణులు ఇప్పటికే అసహనం వ్యక్తం చేస్తున్నాయి. తాజాగా బీజేవైఎంలోనూ గ్రూపు తగాదాలు బయటపడ్డాయి. గురువారం రాష్ట్ర బీజేపీ కార్యాలయం ముందే బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాశ్ వర్గం, జాతీయ కోశాధికారి సాయిప్రతాప్ వర్గం మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్‌చుగ్ ముందే రెండు గ్రూపులు బాహాబాహీకి దిగాయి. తరుణ్ చుగ్ చెప్పినా వినిపించుకోలేదు. దీంతో పార్టీ పరువు బజారున పడిందని నేతలు ఆవేదన వ్యక్తంచేశారు.

### 50 మంది నేతలు.. 2 రోజులు చర్చలు

తాజాగా బీజేపీకి చెందిన పాత తరం నేతలు బయటికి వచ్చారు. అసెంబ్లీ టికెట్ల కేటాయింపులో తమకూ ప్రాధాన్యం ఇవ్వాలంటూ కొత్త డిమాండ్ మొదలు పెట్టారు. గ్రేటర్ హైదరాబాద్‌కు చెందిన దాదాపు 50 మంది నేతలు రెండు రోజులుగా వరుసగా చర్చలు జరుపుతున్నారు. ఇందులో మల్లారెడ్డి, సుధాకర్‌శర్మ వంటి సీనియర్ నేతలు ఉన్నట్టు సమాచారం. రెండు మూడు దశాబ్దాలుగా ఏమీ ఆశించకుండా పార్టీకి సేవలు అందిస్తున్నామని, పార్టీకి ఏమాత్రం గుర్తింపు లేని సమయంలోనూ తాము సేవచేశామని, ఇప్పుడు కాస్తో కూస్తో గుర్తింపు వచ్చిన తర్వాత తమను పక్కన పెట్టారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ ఎన్నికల్లో తమకు తగిన సంఖ్యలో సీట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే తగిన నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని పార్టీ రాష్ట్ర నాయకత్వానికి అల్టిమేటం జారీ చేసినట్టు సమచారం. ఇప్పుడు కాకపోతే భవిష్యత్తులోనూ తమకు కనీసం పట్టించుకోవడం కూడా మానేస్తారని వాపోతున్నారు.

### పార్టీ పరువు బజారుకు..

కొన్నాళ్లుగా బీజేపీలో జరుగుతున్న పరిణామాలను గమనించిన సీనియర్ నేతలు ఇదేం కొత్త పద్ధతంటూ విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మూడు తరాల నేతలు అసంతృప్తిలో ఉండటం ఏమిటంటూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రానురాను పార్టీ పరువును బజారున పడేస్తున్నారంటూ మండిపడుతున్నారు. సీనియర్లు తమకు గుర్తింపు లేదంటూ పార్టీ కార్యాలయంలో చర్చలు పెడితే.. ప్రస్తుత తరం నేతలు వర్గాలుగా విడిపోయి మీడియాకు ఎక్కి కొట్లాడుకుంటున్నారని, బీజేవైఎంలోని యువ నేతలు ఏకంగా రోడ్డుమీదే వాగ్వాదానికి దిగారని చర్చించుకుంటున్నారు. ఇలా రానురాను నేతలు పార్టీ పరువును మంటగలుపుతున్నారంటూ ఆరెస్సెస్ వాదులు, పాత తరం నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- బీఆర్‌ఎస్‌లోకి బుడగ జంగాల రాష్ట్ర అధ్యక్షుడు



కరీంనగర్ మండలం గోపాల్‌పూర్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో బీజేపీ నాయకుడు, బేడ బుడగ జంగాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి రవీందర్‌తోపాటు దుర్శేడ్, గోపాల్‌పూర్, నల్లగుంట్టపల్లి, దుబ్బపల్లి, మందులపల్లి గ్రామాల్లోని బీజేపీ, కాంగ్రెస్‌కు చెందిన యువ నాయకులు 350 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. మంత్రి గంగుల కమలాకర్ వీరికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

– కరీంనగర్ రూరల్

### లెఫ్ట్‌తో కాంగ్రెస్ దాగుడుమూతలు

హైదరాబాద్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): వామపక్షాలతో పొత్తుపై ఎటూ తేల్చకుండా కాంగ్రెస్ దాగుడు మూతలు ఆడుతున్నది. శుక్రవారం ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ ఎన్నికల స్క్రీనింగ్ కమిటీ సమావేశంలో వామపక్షాలతో పొత్తుపై పలువురు నేతలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో కథ మొదటికొచ్చింది. మెజార్టీ పార్టీ నేతలు వామపక్షాలతో పొత్తు అవసరం లేదని అభిప్రాయపడ్డారని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పేర్కొన్నారు. ఇదే అంశంపై శనివారం ఆయన వామపక్ష నేతలతో సమావేశం కానున్నారు. ఇది ఒక కొలిక్కి వచ్చిన తరువాతే కాంగ్రెస్ అభ్యర్థుల జాబితాను ప్రకటించే అవకాశం ఉన్నది. రాష్ట్రంలో సీపీఎంకు మిర్యాలగూడ, భద్రాచలం స్థానాలు, సీపీఐకి మునుగోడు, కొత్తగూడెం స్థానాలు కేటాయిస్తారని తొలుత ప్రచారం జరిగింది.

# సామాన్యులే సమిధలు

- పోలీసుల తనిఖీలతో సామాన్య ప్రజలకు ఇక్కట్లు
- కనీస అవగాహన కల్పించని పోలీసులు, ఈసీ

హైదరాబాద్, అక్టోబరు 13 (నమస్తే తెలంగాణ): ఎన్నికల నియామవళిలో భాగంగా పోలీసులు చేపట్టిన తనిఖీలతో సామాన్యులు ఇక్కట్లు పడుతున్నారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు పార్టీలు, అభ్యర్థులు తరలించే డబ్బును అడ్డుకోవాలన్న లక్ష్యంతో తనిఖీలు చేపడుతున్నారు. నగదు, బంగారం రవాణా చేసే సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఎంత మొత్తాన్ని తీసుకువెళ్లాలి, ఎలాంటి పత్రాలు, కారణాలు చూపించాలనే అంశాలపై కనీస అవగాహన కల్పించకుండా చేస్తున్న తనిఖీలపై సామాన్యుల్లో ఆగ్రహం వ్యక్తంఅవుతున్నది. నగదు పట్టుకున్న సమయంలో పత్రాలు లేకుంటే ఎప్పటి వరకు పత్రాలు సమర్పించవచ్చు అనే విషయాలపై అవగాహన కల్పించడం లేదు. దీంతో ప్రజలు గందరగోళానికి గురవుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఆధారాలు చూపించినా కూడా పోలీసులు నగదు సీజ్ చేస్తున్నారని సమాచారం. తెలంగాణలో దసరాను పెద్ద ఎత్తున జరుపుకొంటారు. ప్రతి ఇంట్లో కొత్త బట్టలు, ఆభరణాలు కొనుక్కొవడం సంప్రదాయంగా వస్తున్నది. ఈ నేపథ్యంలో పండుగ షాపింగ్ కోసం తీసుకెళ్లే డబ్బులను సైతం తనిఖీల పేరుతో సీజ్ చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తనిఖీలను ఎవరు వ్యతిరేకించకపోయినా పోలీసులు, ఎన్నికల సంఘం ప్రజలకు కనీస అవగాహన, చైతన్యం తీసుకరావడంలో విఫలమయ్యాయనే విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.



కరీంనగర్‌లో పట్టుబడిన నగదును చూపుతున్న డీసీపీ రాజు, ఏసీపీ నరేందర్

# కరీంనగర్ జిల్లాలో 46 లక్షలు పట్టివేత

రాంనగర్/ కరీంనగర్ (నమస్తేతెలంగాణ) అక్టోబర్ 13: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఆధారాలు లేకుండా తరలిస్తున్న సుమారు రూ.46 లక్షల నగదును శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా వెళ్తున్న పవన్ కల్యాణ్ వద్ద రూ.16.69 లక్షలు పట్టుకున్నామని డీసీపీ రాజు, ఏసీపీ నరేందర్ తెలిపారు. గాజుల శ్రీనివాస్ వద్ద రూ.2.90 లక్షలు, అబ్దుల్ జబ్బర్‌ఖాన్ వద్ద రూ.6 లక్షల చొప్పున స్వాధీనం చేసుకొని రిటర్నింగ్ అధికారికి అప్పగించినట్టు వారు తెలిపారు. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం పన్నూరు చౌరస్తా వద్ద లక్కారం గ్రామానికి చెందిన గుర్రం మధుకర్‌రెడ్డి వద్ద రూ.2,53,460 నగదును అక్కడి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్టీపీసీ ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్‌లో నిరంజన్ వద్ద రూ.15.30 లక్షల నగదును పట్టుకున్నారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం రాజారాం శివారులోని పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద చొప్పదండి మండలం మంగళపల్లికి చెందిన వెలమ సౌజన్య వద్ద రూ.4.50 లక్షలను పోలీసులు పట్టుకున్నారు. ఆధారాలు చూపకపోవడంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో ఓ వాహనంలో తరలిస్తున్న రూ.15 వేల విలువైన 83 చీరలను పోలీసులు పట్టుకున్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.